లగచర్లలో సర్కారుది రాజకీయ కోణం

- పోలీసుల తీరు తీవ్ర అభ్యంతరకరం
- కేవలం బీఆర్ఎస్ వారిపైనే కేసులా?
- ఘటనతో బీఆర్ఎస్‌కు సంబంధమేంటి?
- ఇది రైతులు, ప్రభుత్వం మధ్య సమస్య
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తేతెలంగాణ): లగచర్ల ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కోణంలో చూడటం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తేల్చిచెప్పారు. ఇలాంటి చర్యలు రాజకీయ పార్టీలకు శ్రేయస్కరం కాదని హితవు పలికారు. భూములు కోల్పోతున్నామని ఆవేదనతోనే అధికారులపై రైతులు దాడి చేశారని పేర్కొన్నారు. ఈ ఘటనలో పోలీసుల తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలను వదిలి, కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలపైనే కేసులు పెట్టి, జైలుకు పంపడమేమిటని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు పోలీసులకు తగదని పేర్కొన్నారు. అధికారులపై దాడి ఘటనలో భూములు కోల్పోతున్న అన్ని పార్టీల రైతులు ఉన్నారని తెలిపారు. లగచర్ల సమస్య ప్రభుత్వానికి, ఐదు గ్రామాల రైతులకు మధ్య నెలకొన్నదని తెలిపారు. ఫార్మా కంపెనీ పేరుతో గిరిజనుల భూములను బలవంతంగా లాక్కోవడం ప్రభుత్వానికి మంచిది కాదని, పంట భూముల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటును సీపీఎం వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అందరి ఆమోదంతోనే ప్రభుత్వం భూ సేకరణ జరపాలని సూచించారు. కలెక్టర్, అధికారుల బృందంతో ప్రజాభిప్రాయ సేకరణ కోసం వస్తున్నారనే విషయమే తమకు తెలియదని లగచర్ల గ్రామస్థులు పేర్కొన్న విషయాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతులపై నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని కోరారు.

లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- గిరిజనుల భూములపై పాలకుల కన్ను
- ప్రాజెక్టులు, కంపెనీల కోసం కుట్ర
- గిరిజన నేత అంజయ్యనాయక్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తేతెలంగాణ): లగచర్లలో అమాయక గిరిజన రైతులపై మోపిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన రైతులను ఏకం చేసి వారి హక్కుల కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన గిరిజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్లలో అర్ధరాత్రి రైతులను అరెస్టు చేయడం, వారిని అడ్డం పెట్టుకొని ఆడుతున్న నాటకంపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. పచ్చటి పొలాలను సాగు చేస్తున్న రైతుల భూముల్లో ఫార్మా కంపెనీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసే కుట్ర పన్నిందని విమర్శించారు. న్నారు. కంపెనీల ఏర్పాటు యోచనను ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలను, వారి సాగుభూములను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు, కంపెనీల ఏర్పాటు పేరుతో భూములను కొల్లగొడుతున్నాయని ఆరోపించారు. ముచ్చర్లలో భూముల్లో ఫోర్త్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు రియల్ ఎస్టేట్ వ్యాపారం ముసుగును కమ్మేసిందని ఆరోపించారు.

కేటీపీపీలో విద్యుత్తు ఉత్పత్తికి బ్రేక్

600 మెగావాట్ల ప్లాంట్‌కు వార్షిక మరమ్మతులు • 60 రోజులపాటు ఉత్పత్తి నిలిపివేత

గణపురం, నవంబర్ 15: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూరులోని కాకతీయ థర్మల్ విద్యుత్తు కేంద్రం (కేటీపీపీ) రెండోదశ 600 మెగావాట్ల ప్లాంట్‌లో 60 రోజులపాటు కరెంట్ ఉత్పత్తి నిలిపివేయనున్నారు. వార్షిక మరమ్మతులో భాగంగా రెండో దశ ప్లాంటును ఓవరాలింగ్ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం రాత్రి నుంచి విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు. గతంలో 2021 నవంబర్‌లో ప్లాంటుకు ఓవరాలింగ్ చేశారు. తాజాగా ఈ నెలలో మరమ్మతులు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు.

చెల్పూరులోని కేటీపీపీ ప్లాంట్

రాష్ట్రంలో రాక్షసపాలన

- వేల కోట్ల కమీషన్ కోసమే ఫార్మాసిటీ
- బీఆర్ఎస్ హుజూర్‌నగర్ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి

నేరేడుచర్లలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి, నాయకులు

నేరేడుచర్ల, నవంబర్ 15 : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాక్షసపాలన కొనసాగుతున్నదని, ప్రశ్నిస్తే కేసులు నమోదు చేసి జైల్లో పెడుతున్నారని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయ కర్త ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. కలెక్టరే దాడి జరుగలేదని చెప్తున్నా.. జైల్లో పెట్టారని, లగచర్ల గిరిజన కుటుంబాల ఉసురు సీఎంకు తగులుతుందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గిరిజన మహిళలు తమ వెనక ఏ పార్టీ, ఎవరూ లేరని, భూములను కాపాడుకోవడానికే కడుపు మండి ఆందోళన చేపడుతున్నామని చెప్పారని పేర్కొన్నారు. 1600 ఎకరాలు ఫార్మా కంపెనీలకు అప్పగించేందుకు ఒప్పందం కుదిరిందని, దాని ద్వారా వేల కోట్లు కమీషన్ వస్తుందని ఆరోపించారు. కొడంగల్ నుంచే రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమైనదని అన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే ధాన్యం కొనుగోలు చేయాలని ట్రాక్టర్లతో నిరసన వ్యక్తం చేస్తుంటే ఆయన మహారాష్ట్రలో ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. 20 రోజులైన ధాన్యం కొనుగోళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపైన అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అయినా ఎవరూ భయపడరని చెప్పారు. అనంతరం నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడికి వచ్చిన రైతులు బాధలను అడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లులో అమ్మిన ధాన్యానికి కూడా ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మండలాధ్యక్షుడు అరిబండి సురేశ్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయ బాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, బీఆర్ఎస్ పట్టణ, మండల ప్రధాన కార్యదర్శులు చిత్తలూరి సైదులు, యల్లబోయిన లింగయ్య, హుజూర్‌నగర్ మాజీ జడ్పీటీసీ కొప్పు సైదిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వర్‌రావు, నేరేడుచర్ల మాజీ గ్రంథాలయ చైర్మన్ గుర్రం మార్కండేయ, తదితరులు ఉన్నారు.

రైతులది ధర్నాగ్రహం

మొదటిపేజీ తరువాయి...

ఆక్రోశంతో, ఆగ్రహంతోనే తిరుగుబాటు చేస్తారని, రాజకీయ ప్రయోజనాలను వారు పట్టించుకోరని తెలిపారు. అధికారులు పరిష్కారం చూపలేకపోతున్నారనే బాధతోనే కలెక్టర్, ఇతర ప్రభుత్వ అధికారులపై రైతులు ధర్నాగ్రహం ప్రదర్శించారని ఆమె తెలిపారు. అణిచివేతలు, అక్రమ కేసులతో సమస్యలు పరిష్కారం కావని, వారి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి మార్గం చూపితేనే అసలు సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

రైతులను విడుదల చేయాలి

ఫార్మా సిటీని వ్యతిరేకిస్తున్న లంబాడ రైతుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నా. పోలీసులు అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి. వారిపై కేసులను రద్దు చేయాలి. లేకుంటే రాష్ట్రంలోని 50 లక్షల బంజారా సమాజాన్ని మేల్కొలుపుతాం. రైతుల పక్షాన నిలబడి కొట్లాడుతాం.

- ఓయా జేపీసీ చైర్మన్ డాక్టర్ నెహ్రూ నాయక్

కాస్తులో ఉన్నా కాంగ్రెసోళ్లు కబ్జా చేసిండ్రు

మొదటిపేజీ తరువాయి...

చెందిన సుంకరి శేఖరయ్య పేరిట సర్వే నంబర్ 340, 341లలో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన బిజ్జలి నారాయణ, భూమిని పెంటయ్య 1977లో చెరో ఆరెకరాలు కొనుగోలు చేశారు. సర్వే నంబర్ 340లోని ఆరెకరాలను అగ్రిమెంట్ చేసుకుని సాదాబైనామా పత్రాలతో కాస్తులో ఉండగా, సర్వే నంబర్ 341లోని ఆరెకరాలకు అప్పట్లోనే పట్టా పొందారు. అప్పటి నుంచి వారిద్దరూ కాస్తులో ఉంటూ సాగు చేసుకుంటున్నారు. నారాయణ, పెంటయ్య మరణానంతరం వారి వారసులు సాగు చేసుకుంటున్నారు.

ఐదారు నెలలుగా వేధింపులు

అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు ఈ భూమిపై కన్నేసి అధికారులతో కలిసి తమను వేధిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కన్నీళ్లు పెట్టుకున్నారు. బిజ్జలి నారాయణ, పెంటయ్య దాయాదులైన కొందరు భూమిని అగ్రిమెంట్ చేసుకున్నట్టు పత్రాలు సృష్టించి తమను వేధిస్తున్నారని తెలిపారు. సర్వే నంబర్ 341లోని భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని సర్వే నంబర్ 340లో కాస్తులో ఉన్నారని, వెంటనే ఆ భూమిని వదిలిపెట్టి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని వివరించారు. శుక్రవారం కాంగ్రెస్ ముఖ్యనేత బంధువులు వచ్చి భూమిలో బలవంతంగా కడీలు పాతేందుకు ప్రయత్నించగా నారాయణ, పెంటయ్య వారసులైన చంద్రయ్య, శివయ్య, కృష్ణయ్య, బాలరాజు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం తలెత్తింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ దశాబ్దాలుగా తాము కాస్తులో ఉన్నామని, గ్రామానికి చెందిన నాయకులు గోపాల్, అమరేశ్ ఇటీవల తమ భూమిని ఇతరులకు అగ్రిమెంట్ చేయించి వేధిస్తున్నారని తెలిపారు. దీనివెనక బడా నాయకుల హస్తం ఉందని ఆరోపిస్తున్నారు. తమ భూములను లాక్కుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు.

లోకం పోకడ



ఈయన కూడా ఇంటింటి సర్వే చేస్తున్నాడు సార్! కూల్చిన ఇండ్లు ఎన్ని? వున్న ఇండ్లు ఎన్నో లెక్కేస్తున్నాడు!

షాద్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్

కొడంగల్‌లో తిరుపతిరెడ్డికి స్వాగతాలెందుకు?

- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్

షాద్‌నగర్, నవంబర్ 15 : కొడంగల్ సెగ్మెంట్‌ను సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అన్నీ తానై శాసిస్తున్నారని, ఏ హోదాతో అతనికి కలెక్టర్, అధికారులు స్వాగతం పలుకుతున్నారని లంబాడా హక్కుల పరిరక్షణ సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్ ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు గ్రామాల ప్రజలు ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ పది నెలలుగా నిరసనలు చేపడుతుంటే.. కనీసం వారితో చర్చించకుండా బెదిరింపులకు దిగడం రేవంత్‌రెడ్డి సర్కారుకు తగదని సూచించారు. గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతుండగా కొందరు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టేలా భూములను గుంజుకుంటామని చెప్పడంతో ప్రజలు ఆగ్రహానికి గురై అధికారులపై దాడులకు ప్రయత్నించారని, ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. లగచర్లతోపాటు గిరిజన తండాల్లో పోలీస్ బందోబస్తును ఎత్తి వేయాలని, రైతులపై కేసులను తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లగచర్లలో ప్రజలది తిరుగుబాటు

కొడంగల్‌లోని లగచర్లలో జరిగింది దాడి కాదు. అది ప్రజల తిరుగుబాటు. ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఆ గ్రామ ప్రజలు ఆందోళన చేస్తున్న విషయం సీఎం రేవంత్‌రెడ్డికి తెలువదా? ఎందుకు లంబాడీల భూములను గుంజుకోవాలని చూస్తున్నారు? ఫార్మాసిటీ కోసం ముచ్చర్లలో ప్రభుత్వం 14 వేల ఎకరాల భూమిని సేకరించింది.. అక్కడే ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసుకోవాలి.

- భూక్యా సంజీవ్‌నాయక్, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు

గిరిజనులపై దాడి అమానుషం

సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ బిడ్డలపై ప్రేమ ఉంటే ముచ్చర్లలో ఫార్మాసిటీని అభివృద్ధి చేయాలి. కొడంగల్‌లో ఉన్న గిరిజనుల భూములను లాక్కోవద్దు. సీఎం సోదరులు తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే ఫార్మా పేరుతో గిరిజనుల భూములను గుంజుకుంటున్నారు. ఇది సరైనది కాదు.

- గణేశ్‌నాయక్, నగారాభేరి లంబాడీ హక్కుల పోరాట సమితి

తిరుగుబాటు జెండా ఎగురవేస్తాం

లంబాడీలకు లడాయి కొత్త కాదు. చావనైనా చస్తాం కానీ భూములను వదులుకునే ప్రసక్తే లేదు. సీఎం రేవంత్‌రెడ్డి తన అల్లుడికి ఇవ్వాల్సిన భూమి కోసం లంబాడీల భూములపై పడితే కొడంగల్‌లో తిరుగుబాటు జెండా ఎగురేస్తాం. లంబాడీలపై కక్ష కట్టి జైలుకి పంపడం అంటే.. మీ గోతులు మీరే తీసుకుంటున్నారు. లంబాడ బిడ్డలను వెంటనే విడుదల చేయాలి. వారిని హింసించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.

- గుగులోతు భీమా నాయక్, లంబాడీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సర్వేను ఆదర్శంగా నిర్వహించాలి

- అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- 44.1% పూర్తయినట్టు అధికారుల వెల్లడి

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ,రాజకీయ, కుల సర్వేను దేశానికే ఆదర్శవంతంగా నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సర్వే తీరుపై అధికారులతో సమీక్షించారు. సర్వేను జాప్యం లేకుండా నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. తొలిదశలో నివాసాల లిస్టింగ్‌లో మొత్తం 1,16,14,349 ఇండ్లకు మార్కింగ్ చేశారని, వీటిలో ఏ ఒక్క ఇల్లును వదలకుండా సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ సర్వే రాష్ట్ర పౌరుల అభ్యున్నతికే జరుగుతున్నదని చెప్పారు. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 44.1 శాతం అంటే 5,24,542 ఇండ్లలో సర్వే పూర్తయిందని, ఈ సర్వేలో 87,807 మంది సిబ్బంది, 8,788 పర్యవేక్షక అధికారులు పాల్గొంటున్నారని, ప్రజల నుంచి స్పందన బాగుందని అధికారులు సీఎంకు వివరించారు. 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి సర్వే జరుగుతున్నదని చెప్పారు. సర్వే ప్రక్రియ పర్యవేక్షణకు ఐఏఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాలవారీగా నియమించినట్టు వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ప్రణాళికాశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోరుబాటలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు

- ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం మరోసారి నిరసన
- గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను ఇవ్వబోమని తీర్మానం
- నిధుల మంజూరుపై సీఎం మొహం చాటేయడంపై ఆగ్రహం
- రాష్ట్రసర్కారుతో తాడోపేడో తేల్చుకునేందుకు సన్నద్ధం

నల్లగొండ జిల్లా కేంద్రంలో బంద్‌లో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు(ఫైల్)

జగిత్యాల, నవంబర్ 15, (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ డిగ్రీ కాలేజీల కరస్పాండెంట్లు, లెక్చరర్లు మరోసారి రాష్ట్ర సర్కారుపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. ఏండ్లుగా ప్రైవేట్ డిగ్రీ కాలేజీలకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ మంజూరు చేయకపోవడంతో పోరుబాట పట్టాలని నిర్ణయించారు. అధికారంలోకి వచ్చాక రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చి.. తీరా సీఎం అపాయింట్‌మెంట్ సైతం ఇవ్వకపోవడంపై తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. నెలక్రితం కాలేజీలను బంద్‌చేసి నిరసనలు తెలిపితే.. మూడు నాలుగు రోజుల్లో నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చి.. ఇప్పటికీ పట్టించుకోకపోవడంపై మండిపడుతున్నారు. దీంతో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

గత ప్రభుత్వంలో 90% మంజూరు

రాష్ట్రంలో 890 ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలుండగా 7లక్షల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. 1.50లక్షల మంది బోధన, బోధనేతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. 2021-2022లో 90శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కాలేజీలకు అప్పటి ప్రభుత్వం చెల్లించింది. అయితే కరోనా విజృంభణ నేపథ్యంలో 2022-2023 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీలకు నిధులు మంజూరులో జాప్యం జరిగింది. అలాగే 2023-2024కు సైతం నిధులు పెండింగ్‌లో పడిపోయాయి. రెండున్నర రెండ్లు నిధులు రాకపోవడంతో ప్రైవేట్ కాలేజీలు పూర్తిగా కుదేలు అయిపోయాయి. ఈ నేపథ్యంలోనే 2023 ఆగస్టులో అప్పటి కేసీఆర్ సర్కార్ ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం రూ.500 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టోకెన్లు ఎస్టీవో కార్యాలయాలకు చేరి నిధులు కాలేజీల అకౌంట్లలోకి జమ అవుతాయన్న సమయంలోనే ఎన్నికల కోడ్ విడుదలైంది. దీంతో రూ.500 కోట్లు నిలిచిపోవడంతో ప్రైవేట్ కాలేజీలన్నీ ఉసూరుమన్నాయి.

4 రోజుల్లో నిధుల మంజూరుకు హామీ

ఓ వైపు కాలేజీల నిర్వహణకు చేసిన అప్పులు, వాటికి వడ్డీలు పెరిగిపోవడంతో ఇద్దరు కరస్పాండెంట్లు ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మృతిచెందారు. మరికొందరు కాలేజీలను తెగనమ్ముకున్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ల యాజమాన్యం దసరా పండుగ తర్వాత మూడునాలుగు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు మూసేసి దీక్షకు దిగారు. పరిస్థితి చేయిదాటుతుండడంతో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కరస్పాండెంట్ల సంఘంతో చర్చించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాలుగు రోజుల్లో నిధులు మంజూరు చేస్తారని.. బంద్‌ను విరమించాలని కరస్పాండెంట్లు, సంఘం నాయకులకు విజ్ఞప్తి చేశారు. దీంతో కరస్పాండెంట్లు బంద్‌ను విరమించి, కాలేజీలను నిర్వహించారు. నాలుగు రోజులు అన్న గడువు నెలరోజులైనా.. కార్యరూపం దాల్చకపోవడంతో కరస్పాండెంట్లు మళ్లీ ఆలోచనలో పడిపోయారు.

మళ్లీ కాలేజీలు బంద్ చేయాలని తీర్మానం

నిధుల విషయంలో సీఎం మాట తప్పడంతో మరోసారి కరస్పాండెంట్లు ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. కరస్పాండెంట్ల సంఘంతోపాటు, యాజమాన్యులందరూ మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించినట్టు సమాచారం. సమావేశంలో ప్రభుత్వంపై పోరాటం చేయాలని తీర్మానించినట్టు తెలిసింది. 17, 18న గ్రూప్-3 పరీక్షలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే హాల్ టికెట్లు సైతం జారీ అయ్యాయి. అయితే పరీక్ష సెంటర్లలో సింహభాగం ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లోనే ఏర్పాటు చేశారు. దీంతో గ్రూప్-3 పరీక్షలకు తమ కాలేజీలను ఇవ్వవద్దని, సంఘం తీర్మానించినట్టు తెలుస్తుంది. ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు భావిస్తున్నట్టు సమాచారం. అలాగే వారం వ్యవధిలో మరోసారి సమావేశం నిర్వహించుకొని, మూకుమ్మడిగా కాలేజీలను నిరవధికంగా మూసేసి రోడ్డెక్కాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది. ఈ విషయమై టీజీపీఎస్సీ చైర్మన్‌తో పాటు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు పోరుబాట తప్ప మరో మార్గం లేదని, ప్రభుత్వ మొండి వైఖరే ఇక్కడి వరకు తీసుకువచ్చిందని కరస్పాండెంట్ల సంఘంలో కీలక భూమికి పోషిస్తున్న ఓ కరస్పాండెంట్ ఆవేదన వ్యక్తంచేశారు.

'ఫీజు' బకాయిలు 5900 కోట్లు

- ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ సర్కారు
- వివిధ కోర్సుల్లో సాగుతున్న ప్రవేశాలు
- సర్టిఫికెట్లు ఇవ్వని యాజమాన్యాలు
- సతమతం అవుతున్న విద్యార్థులు
- ఫీజులు చెల్లించాలని నేడు రాష్ట్రవ్యాప్త ధర్నా
- తరగతులు బహిష్కరించాలి: ఆర్ కృష్ణయ్య

> వరంగల్ జిల్లాలో ఓ ప్రైవేట్ కాలేజీలో ఓ విద్యార్థి పాలిటెక్నిక్ పూర్తిచేశాడు. రెండేండ్లపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ వచ్చింది. చివరి ఏడాది రూ.20 వేల వరకు విడుదల కావాల్సి ఉన్నది. దీంతో కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. సదరు విద్యార్థి పాలిటెక్నిక్ పూర్తిచేసినా ఉన్నత విద్యకు దూరమయ్యాడు. అప్పో సప్పో చేసి ఫీజు కట్టినా, ఉన్నత విద్యకు మళ్లీ ఫీజు చెల్లించే స్థోమత లేదని ఆ నిరుపేద విద్యార్థి ఆవేదన. రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలకు అతను ఎదురుచూస్తున్నాడు.

హైదరాబాద్, నవంబర్15 (నమస్తే తెలంగాణ): 'ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు బకాయిలన్నింటినీ చెల్లిస్తాం' ఇదీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానం. అధికారంలోకి వచ్చి 10 నెలలైనా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్నింటినీ వన్‌టైం సెటిల్‌మెంట్ చేస్తామంటూ మాట మార్చింది. ఆ విషయాన్ని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే ప్రకటించారు. కానీ, ప్రభుత్వం ఆ దిశగా అడుగువేసిందే లేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను మూడు నెలలకు ఒకసారి వాయిదాల పద్ధతిలో చెల్లించేలా ప్రభుత్వం గతంలో మార్గదర్శకాలను తీసుకొచ్చింది. దాని ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభంలో 25 శాతం, మధ్యలో 50 శాతం, చివరలో మరో 25 శాతం చెల్లించాల్సి ఉన్నది. కానీ ఈ ప్రభుత్వం అది పాటించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల్లో భాగంగా ఆయా కళాశాలలకు ప్రభుత్వం ఏడాది క్రితం టోకెన్లను జారీ చేసినా ఇంతవరకూ ఆ నిధులనూ విడుదల చేయలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించి ఒక్క ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులే దాదాపు రూ.5,900 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని తెలుస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే మొత్తంగా 8,000 కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

కాలేజీల ఒత్తిళ్లు.. విద్యార్థుల అవస్థలు

ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందనే ఆశతోనే అనేక మంది బడుగు బలహీనవర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి ముందుకొస్తున్నారు. ప్రైవేట్ కాలేజీల్లోనూ చేరుతున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయి. విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

నిధులపై విడుదలపై తర్జన భర్జన

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీసీ సంక్షేమ శాఖకు ప్రభుత్వం ఇటీవల రూ.1,502 కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీచేసింది. కానీ ఒక్క రూపాయి కూడా ఖాతాలో జమ చేయలేదు. ఆ నిధులను ఏ మేరకు వినియోగించాలనే అంశంపైనా అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. యాజమాన్యాలు ఒకవైపు బకాయిల కోసం వెంట పడుతుండగా, మరోవైపు ఈ ఏడాది ఇప్పటికే అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఆ బకాయిల చెల్లింపులకు వినియోగించాలా? లేదంటే ఈ ఏడాది అడ్మిషన్ పొందుతున్న విద్యార్థుల కోసం మంజూరు చేయాలా? అనే దానిపై స్పష్టత లేకుండా పోయిందని అధికారులు వాపోతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. పాల్గొన్న రామకృష్ణ, వెంకటేశ్ తదితరులు

నేడు కలెక్టరేట్ల ముట